సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 21 । డిసెంబర్ । 2022



చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు
జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ తెలిపారు. 8లో



చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రాజులమ్మ
చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జియితే రాజులమ్మ నియమితులయ్యారు. 8లో



ప్రజల అంగీకారంతోనే సమగ్ర భూసర్వే 8లో
గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల అంగీకారంతోనే సమగ్ర భూ సర్వేను చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ సూచించారు.

న్యూస్‌రీల్

నేడు పెట్రోల్ బంకు ప్రారంభం

అడ్డతీగల: మండల కేంద్రంలోని జీసీసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన పెట్రోల్‌బంక్‌ను జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి బుధవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తారని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కార్యక్రమానికి జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణితో పాటు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విచ్చేస్తున్నారని, స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన పవర్ కెనాల్ గండి పూడ్చివేత



జరుగుతున్న గండి పూడ్చివేత పనులు

మోతుగూడెం: ఇటీవల డొంకరాయి పవర్ కెనాల్ గండి పూడ్చివేత పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక కాంట్రాక్టర్లకు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జెన్‌కో అధికారులు ఆదేశించారు. పూడ్చివేత పూర్తయిన వెంటనే కాంక్రీట్ పనులతో పాటు ప్యానెళ్లను త్వరగా పూర్తి చేసి జలవిద్యుత్ ఉత్పత్తి త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జెన్‌కో అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ(సివిల్) ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ 20 రోజుల్లో గండి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పనులపై ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని తెలిపారు. గండి పనులతోపాటు 16 కిలోమీటర్ల పవర్ కెనాల్‌కు ఏమైనా మరమ్మతులు ఉంటే వాటిని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు



గండిపోశమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సురేష్‌బాబు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి నూతన ఆలయనిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం.వి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన గండిపోశమ్మ ఆలయాన్ని సందర్శించారు. ముంపునకు గురవుతున్న ఆలయం, షెడ్లను పరిశీలించారు. అమ్మవారి స్వయంభువు ఆలయానికి రక్షణ కల్పించడంతో పాటు నూతన ఆలయ నిర్మాణానికి అవసరమైన ఇంజినీరింగ్ నిపుణులు త్వరలోనే సందర్శించనున్నట్లు తెలిపారు. నూతన ఆలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం తదితర వివరాలను ఆలయ ఈవో లక్ష్మీకుమార్ ఆయనకు వివరించారు.

వణికిస్తున్న చలిపులి

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిపులి మన్యం ప్రజలను వణికిస్తోంది. మంగళవారం ఉదయం అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 8.3 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 9డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10వరకు పొగమంచు కురిసింది. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి.

జాలీజాలీగా..



గోదావరిలో పాపికొండల విహార యాత్రకు బయలుదేరిన టూరిజం బోటు

ఒకపక్క ఎత్తయిన కొండలు.. మరోపక్క గోదావరి పరవళ్లు..జలపాతాల హొయలు..పక్షుల కిలకిలారావాలు..పున్నమి వెన్నెల్లో ఇసుక తిన్నెలు..నైట్‌హాల్టులు.. నిర్మలమైన వాతావరణం.. ప్రకృతి అందాలను చూస్తూ సాగే బోటు ప్రయాణం.. ఇంతకు మించి ఏం కావాలి..! పాపికొండలు యాత్ర ఇచ్చే మజాయే వేరంటారు యాత్రీకులు.. ఈ అందాలను తిలకించేందుకు పోటెత్తుతున్నారు.

- నిర్మలమైన వాతావరణంలో పాపికొండల విహారం
- ప్రకృతి అందాలను చూస్తూ సాగే ప్రయాణం
- ఆ మజాయే వేరంటున్న పర్యాటకులు
- రోజురోజుకు పెరుగుతున్న సందర్శకుల సంఖ్య

దేవీపట్నం: అఖండ గోదావరిలో బోటులో విహరిస్తూ పాపికొండల అందాలను కనులారా వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. శని, ఆదివారాల్లో వీరి రద్దీ ఎక్కువగా ఉంటోంది. పర్యాటకు శాఖకు ఆదాయం భారీగానే సమకూరుతోంది. ఈ ఏడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు సుమారు 6 వేల మంది పాపికొండలను సందర్శించారు. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పూర్తి స్థాయిలో రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కచ్చులూరు వద్ద ఘటనతో..
మూడేళ్లక్రితం గోదావరినదిలో కచ్చులూరు వద్ద జరిగిన బోటు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్నాళ్లపాటు నిలిచిపోయి పాపికొండల పర్యాటకం మళ్లీ ఊపందుకుంది. పర్యాటకుల భద్రత దృష్ట్యా గోదావరిలో విహరించే పర్యాటక బోట్ల ఇంజన్ సామర్థ్యం, బోట్ల ఫిట్‌నెస్, బోట్ల కెపాసిటీ తదితర అంశాలను ఇరిగేషన్, పోర్టు, పోలీసు, రెవెన్యూ, టూరిజం, అగ్నిమాపకశాఖ శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిబంధనల ప్రకారం బోట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అనుమతులు మంజూరు చేశారు.

పటిష్టమైన రక్షణ వలయంలో..
పాపికొండల విహారయాత్ర గతేడాది నవంబర్‌లో ప్రారంభించినప్పటికీ ఈ ఏడాది జూలై నెలలో గోదావరి వరదల నేపథ్యంలో బోట్ల విహారాన్ని పూర్తిగా నిలిపివేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాపికొండల విహారయాత్రకు ప్రాజెక్టుకు ఎగువన ఉన్న పోశమ్మ గండి వద్ద నుంచి ప్రారంభం అవుతుంది. దేశం నలుమూలల పర్యాటకులను ఆకట్టుకునేందుకు పటిష్టమైన రక్షణ వలయంలో పాపికొండల పర్యాటకాన్ని నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్‌చేసుకున్న పర్యాటకులు రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక వాహనంలో పోశమ్మగండికి తరలివచ్చి టూరిజం బోటులో పాపికొండలను వీక్షిస్తూ పేరంటపల్లికి చేరుకుంటున్నారు.

ప్రమాదాలకు తావులేకుండా..
గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలకు తావులేకుండా పర్యాటకుల భద్రతే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.దీనిలో భాగంగా ఇరిగేషన్, టూరిజం, పోలీసు, ఫైర్, రెవిన్యూ శాఖల సిబ్బందితో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేశారు. రాజమహేంద్రవరం, పోశమ్మగండి, పేరంటపల్లి వద్ద కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. పాపికొండలకు వెళ్లే పర్యాటక బోట్లలో నిబంధనలు మేరకు ప్రతిఒక్కరూ లైఫ్ జాకెట్లు ధరించే విధంగా చర్యలు చేపట్టారు. మునుపెన్నడూ లేనివిధంగా విహరించే బోటుతో పాటు పైలట్ బోటు, గజ ఈతగాళ్లు, శాటిలైట్ ఫోన్‌తో పటిష్టమైన భద్రత మధ్య విహారయాత్ర సాగుతోంది.

ప్రతిరోజూ ఐదు బోట్లలో..
ఈ ఏడాది నవంబర్ 6 వ తేదీన పాపికొండల విహారయాత్ర ప్రారంభం అయింది. అప్పటి నుంచి రోజు రోజుకు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ప్రతిరోజు రెండు నుంచి ఐదు బోట్ల వరకు పాపికొండల విహారయాత్రకు వెళ్తున్నాయి.

సంక్రాంతి సెలవులకు భారీగా పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. పోశమ్మగండి నుంచి ఏపీ టూరిజం శాఖకు చెందిన సర్‌ఆర్థర్ కాటన్ బోటుతో పాటు అనుమతిపొందిన మరో 14 ప్రైవేట్ బోట్లు పాపికొండల విహారయాత్రకు తరలి వెళుతున్నాయి.

పర్యాటకశాఖ ప్యాకేజీలు

పాపికొండల విహారయాత్రకు సంబంధించి పర్యాటక శాఖ పలు ప్యాకేజిలను ప్రకటించింది. రాజమండ్రి నుంచి ఒకరోజు పర్యటనకు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7.30 వరకూ పాపికొండల విహారయాత్రకు వాహనంలో పోశమ్మగండికి తీసుకొచ్చి అక్కడ నుంచి బోటు పై పేరంటపల్లి వరకూ తీసుకువెళ్తారు. పెద్దలకు రూ.1250, పిల్లలకు రూ.1050 ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. అదే రెండురోజుల పర్యటనకు పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు రూ. 2500. టీ, టిఫిన్, భోజనం, స్నాక్స్‌తో పాటు కొల్లూరు గుడిసెలలో బస, రాత్రి భోజనం ఏర్పాటు చేస్తారు.

పోచవరం నుంచి ఒక రోజు పర్యటనకు..
పోచవరం నుంచి పాపికొండలకు ఒకరోజు పర్యటనకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5గంటల వరకూ పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 గాను, రెండురోజుల పర్యటనకు పెద్దలకు రూ.2500, పిల్లలకు రూ. 2000 కు టీ,టిఫిన్, భోజనంతో పాటు రాత్రి బస కొల్లూరు వద్ద గుడిసెలలో ఏర్పాటు చేస్తారు.

వ్యాసరచన పోటీల్లో చింతపల్లి ఏఎస్పీ ప్రతిభ

- జాతీయస్థాయిలో ప్రథమస్థానం



చింతపల్లి: స్థానిక ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ రాసిన వ్యాసం ప్రధాన మంత్రి ఆల్ ఇండియా సిల్వర్‌కప్ వ్యాసరచన– 2022 పోటీల్లో ప్రథమ స్థానానికి ఎంపికైంది. ఈ బహుమతిని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అందజేయనున్నారు. ఆల్ ఇండియా ప్రధాన మంత్రి సిల్వర్‌కప్ వ్యాసరచన పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది పోటీల్లో కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఏఎస్పీ వ్యాసం రాశారు. కోవిడ్ సమయంలో పోలీసులు ప్రజలకు అందించిన సేవలు, జిల్లాలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, మండల కేంద్రంలో నిర్వహించిన సదరం క్యాంప్ విజయవంతంపై హైదరాబాద్ పోలీసు అకాడమీలో ప్రదర్శనపై ఆయన వ్యాసం రాశారు. దీనిని కేంద్ర ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సర్దార్ వల్లాబాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమి న్యాయనిర్ణేతలు ప్రథమస్థానానికి ఎంపిక చేశారు. ఫలితాల ఉత్తర్వులను ఏఎస్పీకి నిర్వాహక అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఆదిత్య పంపించారు. ప్రథమ బహుమతి రావడం పట్ల ఏఎస్పీ సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను పలువురు అభినందించారు.

13,866 మందికి ట్యాబ్‌లు

- నేడు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం చుడుతోంది. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయనున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు. జిల్లాలో 11 మండలాల్లో 13866 మంది విద్యార్థులకు, 1159 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.

గిరి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర

- ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ
- మండలంలో విస్తృత పర్యటన
- కాఫీ రైతులతో సమావేశం
- పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ
- పక్కాగా ఫేషియల్ అటెండెన్స్‌కు ఆదేశం



చుట్టుమెట్టలో కాఫీ రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పెదబయలు: గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యమని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని చుట్టుమెట్టలో పర్యటించారు. కాఫీ రైతులతో సమావేశమయ్యారు. కాఫీ మార్కెటింగ్, పల్పింగ్ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. గిరిజన రైతులు కాఫీని దళారులకు విక్రయించి మోసపోవద్దని అధిక ధరలు చెల్లించే వారికి విక్రయించాలని కోరారు. చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా కాఫీ రైతులకు మంచి గిట్టుబాటు ధర అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏజెన్సీలో 67 వేల మంది రైతులకు 1.8లక్షలు ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ జరిగిందన్నారు. చుట్టుమెట్ట ఎంపీపీ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పీవో తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం రుచిచూసి నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆదేశించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈని ఆదేశించారు. అరడకోట గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 247 మంది విద్యార్థులకు 201 మంది మాత్రమే ఉన్నారని, దీర్ఘ కాలం పాఠశాలకు హాజరు కాని విద్యార్థులను పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ తరగతిలోను హెల్త్ లీడర్లను నియమించాలని ఆదేశించారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల మొబైల్ నంబర్లను ఆశ్రమ పాఠశాలలో ఫ్లెక్సీలో ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు.



అరడకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న పీవో గోపాలకృష్ణ

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఫేషియల్ అటెండెన్స్ పక్కాగా అమలు చేయాలన్నారు .ఈ కార్యక్రమానికి కాఫీ సహాయ సంచాలకులు అశోక్, ఎంపీడీవో విగ్గిన్స్, సీడీపీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఉరుము గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి

జి.మాడుగుల: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి ఆదేశించారు. మండలంలో నిట్టమామడి, బందవీధి, ఉరుము గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. గర్భిణులకు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం వివరాలను ఆమె తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, చిన్నారులను గుర్తించి వారికి ప్రత్యేక పౌష్టికాహారం అందించి రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులకు టీహెచ్‌ఆర్ పథకంలో భాగంగా పచ్చి సరుకులు అందించాలని ఆమె ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు పథకంలో జరుగుతున్న నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సూపర్‌వైజర్లతో సమీక్షించారు.

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడాపోటీలు



గిరిజన క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్



బూసిపుట్టులో ఉత్సాహంగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు

- ఎస్పీ సతీష్‌కుమార్
- అట్టహాసంగా వాలీబాల్ పోటీలు
- అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని గిరి యువతకు సూచన

ముంచంగిపుట్టు: గిరియువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యువహో పేరిట మెగా వాలీబాల్ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ముంచంగిపుట్టు,పెదబయలు మండలాలకు చెందిన 96 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులను ఎస్పీ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గిరిజన యువతలో అపారమైన ప్రతిభ ఉందన్నారు. వాటిని వెలికి తీసేందుకు పోలీసుశాఖ ముందు ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా నైపుణ్యానికి సానబెట్టాలని సూచించారు. త్వరలోనే సిగ్నల్ కష్టాలు తొలగిపోనున్నాయని, 600 సెల్ టవర్లు ఏర్పాటు కానున్నాయని ఆయన తెలిపారు. మారుమూల బుంగాపుట్టు, రంగబయలు, బూసిపుట్టు,కొండ్రుం, మద్దిగరువు గ్రామాలకు పక్కా రహదారులు కల్పిస్తామన్నారు. అభివృద్ధిని అడ్డుకునే మావోయిస్టులకు దూరంగా ఉండాలని, గిరిజనుల మేలు కోరే పోలీసుశాఖకు సహకరించాలని ఆయన కోరారు.

1096 మందికి వైద్యసేవలు
పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం బూసిపుట్టు వారపు సంతలో నిర్వహించిన సంజీవని మెగా మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. విశాఖ నుంచి మెడికవర్, విశాఖ ఐ హాస్పటల్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యనిపుణులు,రూడకోట వైద్యాధికారులు మెడికల్‌క్యాంప్‌లో 1096 మందికి వైద్య సేవలు అందించారు. మందులను పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. రోగులను ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల నుంచి వచ్చిన 3వేల మంది గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. గిరిజనులతో ఎస్పీ కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్రావు, జి.మాడుగుల, పాడేరు సీఐలు సత్యనారాయణ, సుధాకర్, ఎస్ఐలు రవీంద్ర, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, రంజిత్, వైద్యాధికారి శ్యాంప్రసాద్, ఏఎస్ఐ తిరుపతిరావు,సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,ఉపాధ్యాయులు, పీటీలు, మహిళా పోలీసులు, వైద్య,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్టు టీచర్ పోస్టుల భర్తీకి నేటి నుంచి ఇంటర్వ్యూలు

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్‌కు సంబంధించి కేజీబీవీ గెస్టు టీచర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం డైట్ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో వీటిని నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా జగనన్న పచ్చతోరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలకు పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యం వహించారు.

- పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- సీఎం జగన్ జన్మదినం పురస్కరించుకుని మొక్కలు నాటిన ఎమ్మెల్యేలు



గూడెంకొత్తవీధిలో మొక్కలు నాటుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు



గంగవరం ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



యండపల్లి వలస కస్తూర్బా విద్యాలయంలో మొక్కలు నాటుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గూడెంకొత్తవీధి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్న పచ్చతోరణం కార్యక్రమం చేపట్టారు. జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మండల కేంద్రంలోని ఏకలవ్య, రింతాడ, బాలికల ఆశ్రమపాఠశాల, గూడెంకొత్తవీధి కేజీబీవీ పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్‌ఎంపీపీలు ఆనంద్, దేముడు, మైనారిటీ సెల్ జిల్లా సభ్యుడు మజీద్, కోఆప్షన్ సభ్యులు దావూద్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ రమణారావు, అటవీ శాఖ అధికారులు శ్రీనివాసరావు, బాబూరావు, కృష్ణారావు, చిరంజీవి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని యండపల్లివలస కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మొక్కలు నాటారు. మన్యంలో పచ్చదనం పెంచే బాధ్యత అందరూ తీసుకోవాలని కోరారు. మొక్కల పెంపక బాధ్యత విద్యార్థులకు అప్పగించాలని సూచించారు. ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ సుస్మిత,మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రాజరమేష్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

గంగవరం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సూచించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మంగళవారం గంగవరంలో వివిధ చోట్ల మొక్కలు నాటారు. ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల పరిషత్ ఆవరణలో, ఫోక్స్‌పేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి, పార్టీ పరిశీలకులు కర్రిపాపారాయుడు పాల్గొన్నారు. పాతగంగవరం నుంచి కొత్త గంగవరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆశ్రమపాఠశాలలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణం, పచ్చదనంపై పాఠశాల బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, ఎంపీటీసీ కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో మల్లేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం రూన్సీహేన్సన్, సర్పంచ్‌లు కామరాజు, అక్కమ్మ, మరిడమ్మ, లీలావతి, రాజులమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు విద్యార్థినులు హ్యాపీ బర్త్‌డే జగన్ మావయ్య అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

జేసీకి వీఆర్వోల వినతి



జేసీ శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

గంగవరం : మండలంలో రీ సర్వే, ఇతర రెవెన్యూ ప్రభుత్వ కార్యక్రమాల దృష్ట్యా సచివాలయాల్లో మూడుసార్లు బయోమెట్రిక్ హాజరు నుంచి గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని మండల వీఆర్వోల సంఘం నాయకులు అప్పలకొండ, సత్యనారాయణ, రవికుమార్, వెంకన్నదొర తదితరులు జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్‌ను కోరారు. మంగళవారం రాత్రి గంగవరం విచ్చేసిన జేసీను వీఆర్వోలు కలిసి వినతి పత్రం అందజేశారు. వీఆర్వో సంఘం నాయకులు సత్యనారాయణ, రవికుమార్, వెంకన్నదొర మాట్లాడుతూ రీ సర్వే కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వే బృందాలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటిస్తున్నారని, ఈ కారణంగా గ్రామ సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు వేయడంలో ఇబ్బందులు పడుతున్నామని, సర్వేయర్లు, వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు. జేసీ సానుకూలంగా స్పందించినట్టు వీఆర్వో సంఘం తెలిపారు.

చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు

- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

అడ్డతీగల: రైతుల వద్ద నుంచి చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వమే గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని జేసీ శివ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వెంకటనగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. స్థానిక సిబ్బందితో మాట్లాడి సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ధాన్యం రవాణాకు అనుకూలంగా గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం గొండోలు,కోనలోవ రైతు భరోసా కేంద్రాల పరిధిలోని కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి సమావేశం అయ్యారు. ధాన్యం కొనుగోళ్లు ఎలా జరుగుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. హమాలీలకు క్వింటాల్‌కు రూ.25 చొప్పున ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని, ఏ ఒక్క రైతూ దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. పౌరసరఫరాలశాఖ డీఎం డి.ఎం.డి. గణేష్,తహసీల్దార్ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి సువర్ణకుమారి, అడ్డతీగల సొసైటీ సీఈవో మణిరాజు,వ్యవసాయ సహాయకులు శ్రీను,అనిల్,తరుణ్,టి.ఎ.పెద్దారెడ్డి,రైతులు పాల్గొన్నారు.



గొండోలులో ధాన్యపు రాశులను పరిశీలిస్తున్న జేసీ శివశ్రీనివాస్

పారదర్శకంగా...

రాజవొమ్మంగి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ తెలిపారు. ఆయన రాజవొమ్మంగి శివారు రైతు పొలాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 11 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. వచ్చే వారం చింతూరులో ఐదు, వై. రామవరంలో రెండు కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని ఆయన పేర్కొన్నారు. రైతులు వద్ద ధాన్యం సిద్ధంగా ఉన్నచోట కొనుగోళ్లు వెంటనే చేపడతామన్నారు. ఇప్పటి వరకు రూ.2.56 కోట్ల విలువైన 1255 టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. రూ.72 లక్షల మేర చెల్లింపులు జరిగాయన్నారు. గత మూడేళ్లుగా తమకు హమాలీ చార్జీలు అందడం లేదని స్థానిక రైతులు జేసీకు విన్నవించారు. ఇందుకు స్పందించిన జేసీ ఈ సారి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకే హమాలి చార్జెస్ జమ చేస్తున్నామన్నారు. పాత బకాయిలు కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సివిల్‌సప్లయిస్ డీఎం గణేశ్‌కుమార్, అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి, వ్యవసాయాధికారి రమేష్ నాయుడు, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శింగిరెడ్డి రామకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ చంద్రశేఖర్

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో పశుగ్రాసం కొరత నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక పశుసంవర్ధ శాఖ ఏడీ చంద్రశేఖర్‌రావు అన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మంగళవారం చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల పశువైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో పశుగ్రాసం కొరత లేకుండా అటవీ ప్రాంతాల్లో పెంచుకునేలా గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. పశువులకు ఆయుర్వేద వైద్యం వినియోగాన్ని వివరించారు. బీసీటీ కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి, ఏడీఆర్ డాక్టర్ సురేష్ కుమార్, ఏవో కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దుకాణం ముందు డస్ట్‌బిన్లు తప్పనిసరి

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

పాడేరు రూరల్ : ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతం, తాజంగి, వంజంగి, లంబసింగి తదితర ప్రాంతాల్లో పారిశుధ్యంపై ఎంపీడీవోలు దృష్టి సారించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణ పనులకు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దుకాణం వద్ద పొడి చెత్త, తడి చెత్త సేకరణకు దుకాణాల యజమానులు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో సర్పంచ్‌ల సహకారం తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు సంఖ్య పెరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ఆశ్రమ పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, గృహ నిర్మాణాలను సంబంధిత శాఖ అధికారులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈలు లావణ్యకుమార్, కొండయ్యపడాల్, డీపీవో కొండలరావు, డీఎల్‌పీవో పీవీఎస్ కుమార్, 11 మండలాల ఎంపీడీవోలు ఉన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

మానవాళి మనుగడకు పచ్చని చెట్లు దోహదం



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న అడ్డతీగల అటవీ క్షేత్రాధికారి లలితకుమారి

అడ్డతీగల: మానవాళి మనుగడకు పచ్చని చెట్లు ఎంతో దోహదం చేస్తాయని అడ్డతీగల అటవీక్షేత్రాధికారి డి.లలితమారి అన్నారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. అటవీక్షేత్రాధికారిలలితకుమారి మాట్లాడుతూ వివిధ రకాల విధ్వంసాల వల్ల అడవులు అంతరించిపోయే పరిస్థితులు తలెత్తాయని, ఈ సందర్భంగా మొక్కలు నాటి, సంరక్షించడంతో భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించగలుగుతామన్నారు. పచ్చన చెట్లు పెంచడంతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు.అడ్డతీగల, వై.రామవరం మండలాల పరిధిలో 11 విద్యాలయాల్లో ఆదాయన్నిచ్చే నేరేడు, వేప, బాదం, జామ తదితర 58 రకాల మొక్కలను మంగళవారం నాటించినట్టు చెప్పారు. బుధవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా అటవీక్షేత్రాధికారి లలితకుమారి ఓ కవితను రచించార్చు,జగతిలో నీ కంటూ ఓ చెట్టు నీ గతిని మార్చేటట్టు.. నాటిన ప్రతి మొక్కను నీ కన్న బిడ్డ వలే పోషించేటట్టు చేపట్టు.. ఓ మహోత్కర్యం..అంటూ రచించిన కవిత ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రాజులమ్మ

- ఉత్తర్వులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ కమిషనర్
- గౌరవ చైర్‌పర్సన్‌గా పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- వైస్ చైర్మన్‌గా అరకు ఎర్రయ్య



రాజులమ్మ

కొయ్యూరు: చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొయ్యూరు మండలం నల్లగొండ గ్రామానికి చెందిన జియితే రాజులమ్మను నియమిస్తూ మార్కెటింగ్ శాఖ కమిషనర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెతో పాటు 18 మంది సభ్యులను నియమించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గౌరవ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. చైర్‌పర్సన్‌గా ఎంపికైన రాజులమ్మ వైఎస్సార్‌సీపీ కొయ్యూరు మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె రావణాపల్లి సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమిచెందారు. పార్టీకోసం కష్టించి పనిచేయడంతో ఆమె సేవలను అధిష్టానం గుర్తించి, ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమించింది. అరకు ఎర్రయ్యను వైస్ చైర్‌పర్సన్‌గా నియమించారు. సభ్యులుగా బంటు నాగేశ్వరరావు,పెయ్యల కుమారి, విరోజి త్రిమూర్తులు,సెగ్గే రాములమ్మ,పాతును భవాని,కూడా లక్ష్మి, కురుజు జోగులమ్మ, పాంగి అప్పన్న, వేమూరు కమల, పొడుగు అచ్యుత రామరాజు, సుంకరి ఆనందరావు, జల్లి చినబుజ్జిబాబు,బత్తుల కిరణ్‌వర్మ నియమితలయ్యారు. చింతపల్లి పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి, చింతపల్లి సర్పంచ్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కూడా సభ్యులుగా వ్యవహరిస్తారు.

రైతులకు మేలు చేసేందుకు కృషి

రైతులకు మేలు చేసేందుకు కమిటీ కృషి చేస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ తెలిపారు. సభ్యులతో సమావేశం అనంతరం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుతో పాటు ఇతర అంశాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు,ఇతర నేతలు రాజులమ్మకు అభినందనలు తెలిపారు.

టూరిస్టు బస్సు బోల్తా



జలతరంగిణి జలపాతం వద్ద కారుపై బోల్తాపడిన టూరిస్టు బస్సు

మారేడుమిల్లి: మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ టూరిస్టు బస్సు బోల్తా పడింది. కాకినాడ జిల్లా పెద్దాపురం గ్రామం నుంచి 25 మందితో టూరిస్టు బస్సులో మారేడుమిల్లికి విహారయాత్రకు వచ్చారు. ఇందులో భాగంగా జలతరంగిణి జలపాతం వద్ద మలుపులో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అక్కడ్డు రోడ్డుకు పక్కన ఆగి ఉన్న కారుపైకి బస్సు దుసుకుపోయి బోల్తా పడింది. అదే సమయంలో ఈ ప్రమాదాన్ని గమనించిన అటువైపుగా వెళ్తున్న వాహనదారులు హుటాహుటిన బస్సులో ఉన్న పర్యాటకులను బయటకు తీశారు. బస్సులో ఉన్న ఎవరికి కూడా ఎటువంటి గాయాలు కాలేదు. అదే సమయంలో కారులో ఎవరు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల అంగీకారంతోనే సమగ్ర భూసర్వే

- పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్

ముంచంగిపుట్టు: గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల అంగీకారంతోనే సమగ్ర భూ సర్వేను చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, ప్రత్యేక సర్వేయర్ల బృందాలతో భూ సమగ్ర సర్వేపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అత్యాధునిక టెక్నాలజీ,డ్రోన్లతో జరుగుతున్న భూ సర్వేను జరిపే ముందు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారి అనుమతితోనే సర్వే చేయాలని సూచించారు. రైతుల సమక్షంలో పూర్తిస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేపట్టాలని సూచించారు. రోజుకు 25 ఎకరాలలో రీ సర్వే చేయాలని, 25 రోజులకు ఒక సర్వేయర్ 625 ఎకరాల్లో పూర్తి చేయాలని ఆయన లక్ష్యం విధించారు. భూతగాదాలు లేకుండా రీసర్వే చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి శ్రీను, గిరిజన సంఘ నేతలు సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నర్సమ్మ, ఆర్‌ఐలు రవి కుమార్, మోహన్‌రావు,సీనియర్ అసిస్టెంట్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ మృతదేహం లభ్యం



ఏఈ హుస్సేన్ (ఫైల్)

చింతూరు : ఈ నెల 13న అదృశ్యం అయిన కూనవరం విద్యుత్ శాఖ ఏఈ ఆదావత్ హుస్సేన్ (48) మృతదేహం కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జమునానగర్ వద్ద పంట కాలువలో మంగళవారం లభ్యమైంది. ఈ నెల 13న కాకినాడ వెళ్లేందుకు చింతూరులో బస్ ఎక్కిన ఏఈ హుస్సేన్ వారం రోజులైనా ఇంటికి చేరకపోవడంతో పాటు సెల్‌ఫోన్ కూడ స్విచ్ ఆఫ్ అయ్యింది. దీంతో ఆందోళనకు గురైన భార్య ప్రవంతి ఈ నెల 17 న తన భర్త అదృశ్యం అయినట్టు చింతూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు రోజులుగా ఏఈ హుస్సేన్ ఆచూకీ కోసం వెతుకుతున్నామని ఈ క్రమంలో కాకినాడ సామర్లకోట మధ్య పంట కాలువలో మృతదేహం లభ్యమైందని చింతూరు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.

రేపటి నుంచి గిరి విజ్ఞాన సంబరాలు

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాలు
- జోనల్‌స్థాయిలో నిర్వహించాలని సూచన

పాడేరు రూరల్ : జోనల్ స్థాయిలో ఈనెల 22 నుంచి 30 వరకు గిరి విజ్ఞాన సంబరాలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన విద్యార్థులకు స్థానిక తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించాలని పేర్కొన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన విద్యార్థులకు పెదబయలు-1 ఆశ్రమ పాఠశాలలో , డుంబ్రిగుడ, అనంతగిరి, అరకువ్యాలీ మండలాల విద్యార్థులకు రవ్వలగూడ ఆశ్రమ పాఠశాల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల విద్యార్థులకు చింతపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల-1లో నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు డిగ్రీ విద్యార్థులు



ఆలిండియా అర్చరీ, ఫెన్సింగ్ క్రీడలకు ఎంపికైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం

రంపచోడవరం: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఇంటర్ యూనివర్సిటీ క్రీడలు ఫెన్సింగ్ ,అర్చరీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. జమ్ము కాశ్మీర్‌లో ఈ నెల 20న నుంచి 23వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఫెన్సింగ్ క్రీడలకు విద్యార్థులు రత్నకుమారి, దుర్గా భవానీ ఎంపికయ్యారన్నారు. పంజాబ్‌లో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఆలిండియా అర్చరీ పోటీలకు చిన్నారి, విజయలక్ష్మి, వెంకట శ్రీనివాస్‌లు ఎంపికైనట్టు చెప్పారు. కేరళ రాష్ట్రం కొట్టాయంలో 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే వాలీబాల్ పోటీల కోచ్‌గా కళాశాల వ్యాయామ అధ్యాపకులు కుమారి, నాగులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

మాతా శిశు మరణాలు అరికట్టేందుకు కృషి



ఉప్ప గ్రామంలోని వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

హుకుంపేట: గ్రామల్లో మాతా శిశువు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా చెప్పారు. మండలంలో ఉప్ప పీహెచ్‌సీ పరిధిలో ఒల్డా గ్రామంలో మంగళవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ క్యాంపును ఆయన పరిశీలించారు. ఉప్ప పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, సేవలందించాలన్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్, వైద్యాధికారులు ప్రశాంత్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

- నిందితుల్లో ఒకరు బీటెక్ విద్యార్థి, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

సీలేరు : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను మంగళవారం జెన్‌కో చెక్‌పోస్టు వద్ద సీలేరు పోలీసులు పట్టుకున్నారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో ప్రయాణిస్తున్న వారిని తనిఖీ చేయగా వారి వద్ద నాలుగు కిలోల గంజాయి లభించింది. గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లతో పాటు కారును సీజ్ చేసి అందులో ఉన్న నలుగురిని రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఒకరు బీటెక్ విద్యార్థి, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మరొకరు గంజాయి సరఫరా చేసిన వ్యక్తి ఉన్నారు. టూరిజం పేరుతో గంజాయిని అక్రమంగా తరలించే ఇతర రాష్ట్రాల వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు

చైతన్యంతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): కాలం మారుతున్నా సంప్రదాయాలు, ఆడపిల్లలు అన్న భయాలతో 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు పెళ్లి చేయడం తప్పని జిల్లా న్యాయ సేవా విభాగం కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. చైతన్యంతోనే బాల్యవివాహాలను నిరోధించగలమన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు కెన్ ఫౌండేషన్, ధరణి సొసైటీ ఆధ్వర్యంలో నగరానికి చెందిన న్యాయవాది కృష్ణప్రసాద్, వెంకట అనంత్ 130 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. ఆర్కేబీచ్ నుంచి వంజంగి వరకు సాగే ఈ పాదయాత్రను మంగళవారం జెండా ఊపి బులికృష్ణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మూడు రోజులపాటు సాగే ఈ పాదయాత్ర ద్వారా 1350 మంది బాలికలకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కెన్ ఫౌండేషన్ అధ్యక్షుడు సంతోష్, ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి సంధానం పాల్గొన్నారు.